క్లుప్తంగా

సాగునీటి ప్రవాహానికి ఆటంకాల్లేకుండా చర్యలు



పొక్లెయిన్ సాయంతో సాగునీటి కాలువలో అడ్డంకుల్ని తొలగిస్తున్న దృశ్యం

మునగపాక: ఇటీవల కురిసిన వర్షాలకు సాగునీటి కాలువల్లో వర్షపు నీరు వచ్చి చేరుతోంది. అయితే మునగపాకలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే పరిస్థితుల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమస్య పరిష్కారానికి జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ ఏర్పాటులో భాగంగా కాలువను కప్పేయడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి, ముంపు తలెత్తే ప్రమాదం నెలకొందన్నారు. ఈ ఇబ్బందుల్ని పరిష్కరించేలా ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రైతు ఆడారి గోపి(టెంట్‌హౌస్) ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

యలమంచిలి: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని భోగాపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు ధూళి రమణ అన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి డెంగ్యూ, డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ వారంలో ఒక రోజు ఇళ్లలోని నిల్వ నీటిని పారబోసి, పాత్రలన్నింటినీ పూర్తిగా ఆరబెట్టాలన్నారు. పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

యాంప్లిఫయర్ వితరణ



మునగపాక సాయిబాబా ఆలయానికి యాంప్లిఫయర్ అందిస్తున్న గణేష్

మునగపాక: స్థానిక సాయిబాబా ఆలయానికి అనకాపల్లిలోని శ్రీనివాస ఎలక్ట్రానిక్స్ అధినేత దాడి సూరిబాబు తనయుడు గణేష్ కుటుంబ సభ్యులు యాంప్లిఫయర్‌ను శనివారం బహూకరించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.10,500 విలువ చేసే పరికరాన్ని ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్రకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు.

బురదమయంగా ఇందిరమ్మ కాలనీ రోడ్లు



బురదమయంగా మునగపాక ఇందిరమ్మ కాలనీ రోడ్డు

మునగపాక: మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మునగపాకలోని ఇందిరమ్మ కాలనీ రోడ్లు బురదమయంగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిసినా రహదారులపై నీరు నిలిచిపోవడంతో పాటు గోతులు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు బురద చేరి, చిత్తడిగా మారుతున్నాయి. కాలనీలోని ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులు కూడా అధ్వానంగా ఉంటున్నాయి. దీంతో రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి పక్కారోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వజ్రకవచాలంకరణలో ధ్యాన వేంకటేశుడు



కశింకోట: స్థానిక శివాలయం వద్ద ఉన్న ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామిని వివిధ రకాల పూల దండలు, తులసీ మాలలతో పాటు వజ్ర కవచంతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

సాయి దివ్య చరణం..
సకల పాప హరణం

ఆషాఢ పౌర్ణమి/గురు పౌర్ణమి పూజలకు ఊరూవాడా సాయినాథుని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ నిర్వాహకులు, భక్తులు ప్రత్యేక పూజలు, అన్నదానాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రమే తిథి మొదలైనా పౌర్ణమి వేడుకల్ని మాత్రం ఆదివారం వేకువజాము నుంచి నిర్వహించనున్నట్లు ఆలయాల అర్చకులు చెప్పున్నారు. కొన్ని వైష్ణవాలయాల్లో ఈ రోజును వ్యాస పౌర్ణమి పేరిట ఏకాహం భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


- నేడు గురుపౌర్ణమి
- ముస్తాబైన సాయిబాబా ఆలయాలు
- ప్రత్యేక పూజలు, అన్నదానాలకు నిర్వాహకుల ఏర్పాట్లు



మునగపాకలోని షిర్డీసాయి ఆలయం



గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైన ధారపాలెం సాయిబాబా మందిరం



ధారపాలెంలో కొలువైన షిర్డీసాయి

రాంబిల్లి(యలమంచిలి): గురుపౌర్ణమి వేడుకలకు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉన్న సాయిబాబా మందిరాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం జరిగే గురుపౌర్ణమి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు భక్తులు శనివారం సాయంత్రం నుంచే సాయిబాబా మందిరాల వద్ద ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఏకాహం భజన, భక్తి గీతాలను ఆలపించారు.

– రాంబిల్లి మండలంలో అప్పన్నపాలెం, దిమిలి, ధారపాలెం, పెదకలవలాపల్లి తదితర గ్రామాల్లో సాయిబాబా మందిరాలను విద్యుత్ దీపాలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం ఉదయం నుంచి సాయిబాబా మందిరాల వద్ద అన్నసమారాధన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపవాస దీక్షలతో సాయిబాబాకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పల్లకీ సేవ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

– పంచదార్ల దరి ధారపాలెంలో షిర్డీ సాయిబాబా మందిరం వద్ద పంచామృతాభిషేకాలు, బాబా అలంకరణ, పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు అర్చకులు తులగాపు నానాజీ శర్మ తెలిపారు.

మునగపాక: మండల వ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పలు ఆలయాలను రంగులతో అలంకరించారు. మునగపాకలో గురుపౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న ఏకాహం 6వ రోజుకు చేరుకుంది. తోటాడలోని ఓంకార పీఠంలో కూడా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం పలు చోట్ల భారీ అన్న సమారాధనలు చేయనున్నారు.

కలిసొస్తున్న కూరగాయల సాగు



కాపుకొచ్చిన వంగ చేను

కోటవురట్ల: కూరగాయల సాగు రైతులకు బాగా కలిసొస్తోంది. తక్కువ పెట్టుబడి, తక్కువ కాలవ్యవధిలో కూరగాయల సాగు లాభాలు తెచ్చిపెడుతోంది. దాంతో పలువురు రైతులు సంప్రదాయ పంట సాగు నుంచి కూరగాయల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో లింగాపురం, జల్లూరు, యండపల్లి, అన్నవరం, బి.కె.పల్లి, చిన బొడ్డేపల్లి, పాములవాక, కె.వెంకటాపురం, తిమ్మాపురం, కైలాసపట్నం తదితర గ్రామాల్లో కూరగాయల సాగు ఎక్కువగా ఉంది. సుమారు 60 హెక్టార్లలో పలు కూరగాయల్ని సాగు చేస్తున్నారు. వంగ, దొండ, బెండ, బీర, పచ్చిమిర్చి, టమాటా తదితర పంటలతో అధిక ఆదాయం ఆర్జిస్తున్నారు. విత్తు నాటిన మూడు నెలలకే ఫలసాయం వస్తుండటంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. సుమారు రూ.10 వేల పెట్టుబడికి, రూ.30 వేలు వరకు ఆదాయం సమకూరుతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

‘వర్షపు నీరు నిలిచిపోకుండా చూడాలి’



మండల పరిషత్ వద్ద నిలిచిన నీటిని చూపిస్తున్న దళిత బహుజన సేన నేత శ్రీనివాసరావు

మునగపాక: రహదారిపై నిలిచిన నీటి కారణంగా పలు పనులపై మండల కార్యాలయాలకు వచ్చే వారు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని దళిత బహుజన సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లంబా శ్రీనివాసరావు కోరారు. మునగపాక మండల సముదాయానికి వెళ్లే ప్రధాన మార్గంలో వర్షపు నీరు నిలిచిపోవడాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సముదాయానికి వెళ్లే దారి లోతట్టుగా ఉండడంతో నీరు నిలిచిపోతోందని, రహదారిని ఎత్తు చేయడం ద్వారా నీరు నిలిచిపోయే పరిస్థితులు ఉండవన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు నిలిచిపోకుండా చూడాలని కోరారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందిస్తున్న భక్తులు

మునగపాక: స్థానికంగా నిర్మిస్తున్న కలియుగ ప్రత్యక్షం దైవం వేంకటేశ్వరుని ఆలయానికి దాతలు సాయం అందించేందుకు ముందుకొస్తున్నారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన పెంటకోట సూరి రామప్పారావు కుమారుడు జానకి హరి నారాయణ తనవంతు సాయంగా రూ.10,116, విశ్రాంత తహసీల్దార్ కోరిబిల్లి రామారావు, నాగరత్నం దంపతులు రూ.10,116 నగదును శనివారం ఆలయ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, విల్లూరి నూక నరసింగరావు, బొడ్డేడ రామునాయుడు, జల్లేపల్లి కృష్ణారావు, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య సలహాలు



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యాధికారి శక్తిప్రియ

ఎస్.రాయవరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ సూచించారు. సర్వసిద్ధి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాల కారణంగా తాగు నీరు కలుషితమయ్యే ప్రమాదముందన్నారు. ఇళ్లలో నీటికి బాగా మరిగించి, వడబోసి, చల్లారాక తాగాలన్నారు. దోమల వ్యాప్తి నిరోధక చర్యల్ని వివరించారు.

గ్రామాల్లో చురుగ్గా పారిశుధ్య పనులు



అరట్లకోటలో చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వప్న

పాయకరావుపేట: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు చురుగ్గా చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. మండల గ్రామాల్లో శనివారం పర్యటించి, పారిశుధ్య నిర్వహణ పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్డు పక్కన పోగేసిన చెత్తను దూర ప్రాంతాలకు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీరాంపురం, నర్సాపురం, అరట్లకోటలో రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను తరలించామన్నారు.

నేడు యానాద్రి అమ్మవారి జాతర



యానాద్రి అమ్మవారు

యలమంచిలి రూరల్: పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో కొలువైన యానాద్రి అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం జరగనుంది. ఏటా ఆషాఢమాసం చివరి ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కాలనీ ప్రధాన రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన బంధుమిత్రులు ఇప్పటికే యలమంచిలి చేరుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ఇంటర్ విద్యార్థులపై కుక్కల దాడి

యలమంచిలి రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ ఇంటర్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై శనివారం వీధి కుక్కలు దాడి చేశాయి. కళాశాల నుంచి బయటికొస్తున్న సమయంలో వీరిపై కుక్కల గుంపు వెంటపడి దాడి చేయడంతో గాయపడ్డారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇదిలా ఉండగా శుక్రవారం సాయంత్రం పట్టణంలోని నాగేంద్ర కాలనీలో ఇంటి బయట ఆడుకుంటున్న ఇద్దరు బాలికలపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వీరిద్దరినీ యలమంచిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్చి, చికిత్స అందించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువ కావడంతో, వాటి బారిన పడిన బాధితుల సంఖ్య పెరుగుతోంది. వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఎస్.రాయవరం: ఆరోగ్య నియమాలు పాటించడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరయ్యే పరిస్థితి ఉండదని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు అన్నారు. పి.ధర్మవరం ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు గణితం, సైన్స్ విభాగాల్లో తయారుచేసిన ప్రాజెక్టుల్ని పరిశీలించి, అభినందించారు. వర్షాకాలంలో విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి వద్ద, స్కూల్లో కాచి వడబోసిన నీటినే తాగాలన్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కేవలం 10వ తరగతి విద్యార్థులపైనే కాకుండా మిగిలిన తరగతుల వారిపైనా దృష్టిసారించాలన్నారు.

తోటాడ, వాడ్రాపల్లిలో ఘనంగా గిరి ప్రదక్షిణ



వాడ్రాపల్లిలో గిరి ప్రదర్శన ప్రారంభిస్తున్న దృశ్యం



తోటాడలో ప్రారంభమైన గిరి ప్రదక్షిణ

మునగపాక: మండలంలోని తోటాడ, వాడ్రాపల్లి ప్రాంతాల్లో గిరి ప్రదక్షిణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. వాడ్రాపల్లిలో తొలిసారిగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామి ఆలయం దరి సింహాద్రప్పన్న పాదాల నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఈ ప్రదక్షిణ గ్రామంలోని వీధుల గుండా సాగింది. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, పెతకంశెట్టి రామజోగినాయుడు, లీలా భాస్కరరావు, శేషు, కన్నుంనాయుడు, చిన్నారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తోటాడలోని ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ వేడుకగా జరిగింది. మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్న పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. సింహాచలంలో జరిగిన గిరి ప్రదక్షిణలో మునగపాకకు చెందిన పెంటకోట రామయ్య కుటుంబీకులు ఏటా చేసినట్లే ఈ ఏడాది కూడా ప్రసాద వితరణ చేశారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి



ఉపాధి కూలీలకు బకాయిలు ఇవ్వాలని వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

యలమంచిలి రూరల్: రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించి, ఉపాధి కూలీల బకాయిల చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం యలమంచిలి తహసీల్దార్ అప్పలరాజుకు రైతు సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమయ్యాయని, కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి రూ.20 వేలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టాన్ని అమలుచేసి అప్పుల నుంచి రైతాంగాన్ని కాపాడాలని కోరారు. ఉపాధి కూలీలకు 10 వారాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు, సీఐటీయూ మండల కన్వీనర్ చింతకాయల శివాజీ, యూనియన్ ప్రతినిధి సత్యనారాయణ ఉన్నారు.

వరి నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు



వెంకటాపురం వరినారులో నీటిని తొలగిస్తున్న రైతులు

ఎస్.రాయవరం: వరి నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరడంతో వరి నారు మడులున్న చోట నీటిని తొలగించాలని రైతులకు సూచించారు. ఈ మేరకు పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల సహాయకులతో కలిసి పొలాల్లో వరినారును పరిశీలించారు. నారుమడుల్లో చేరిన నీటిని తొలగించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సుమారు 20 రోజుల వయసు గల వరి నారుకు తాజా వర్షాలు ఊపిరిపోశాయన్నారు. ప్రస్తుతం నారుమడుల్లో చీడపీడలు లేనప్పటికీ మబ్బు వాతావరణం వల్ల పాడ తెగులు సోకే అవకాశం ఉందన్నారు. నారు చనిపోవడం, ఎండుతున్నట్టు అనిపించినా హెక్సాకొనజోల్ మందును పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. నీరు తొలగించిన నారుమడుల్లో రెండు కిలోల యూరియా, కిలో పొటాష్ వేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు.

వరాహకు పెరుగుతున్న వరదనీరు



జల్లూరు వరాహనదిలో నీటి ప్రవాహం

కోటవురట్ల: ఎగువ ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలకు వరాహనదిలో వరద నీరు చేరి నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. గత రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో చాలా కాలంగా ఎండిపోయిన వరాహనది ప్రస్తుతం జలకళను సంతరించుకుంది. పాతరోడ్డు వద్ద వరాహనదిలో సర్పానది కూడా కలవడంతో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది ఉధృతి కారణంగా ఎవరూ నదిని దాటే ప్రయత్నం చేయొద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నారు.